

కలసపాడులో కనుమ సందర్భంగా నిర్వహించిన పార్వేట కార్యక్రమం

ఊరూరా సంక్రాంతి సంబరం



ప్రొద్దుటూరు మండలం కామనూరులో పార్వేట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కుటుంబ సభ్యులు



చెన్నూరు మండలం పెన్నాతీరంలో పార్వేట ఉత్సవానికి హాజరైన జనం



రాజుపాళెం మండలం టంగుటూరులో వైభవంగా సోమేశ్వర పార్వతీదేవి పార్వేట ఉత్సవం

- పలుచోట్ల పార్వేట ఉత్సవం
- ఉత్సాహంగా పాల్గొన్న జనం

కడప కల్చరల్/చెన్నూరు, జనవరి 15, (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఊరూరా సంక్రాంతి సంబరం నెలకొంది. సోమవారం భోగితో మొదలైన ఈ పండుగ మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమతో ముగిసింది. మూడురోజుల పాటు జరిగే అత్యంత పెద్ద పండుగ అయిన సంక్రాంతికి పల్లెలన్నీ కళకళలాడాయి. వాడవాడలా ప్రతీ ఇంటి ముందు రంగు రంగుల రంగవళ్లులు, గొబ్బెమ్మలతో కొత్త సొబగులు దిద్దుకున్నాయి. కొత్త బట్టలు ధరించి స్నేహితులకు, బంధువులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందంగా గడిపారు. బుధవారం కడప నగర శివారలోని శిల్పారామం జనంతో సందడిగా మారింది. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తమ స్వగ్రామం కామనూరులో కుటుంబసభ్యులతో కలసి పార్వేట ఉత్సవంలో పాల్గొన్నారు. కడప నగరంలోని మరియాపురంలో ఎమ్మెల్యే ఆర్.మాధవి బండలాగుడు పోటీలను ప్రారంభించారు.

పెన్నాతీరం జనసంద్రం

చెన్నూరులో పార్వేట ఉత్సవం వైభవంగా జరిగింది. కనుమపండుగ రోజైన బుధవారం రైతులు పాడి పశువులు, ఎడ్లకు పూజలు నిర్వహించారు. పెన్నాతీరంలో ఉమామహేశ్వరుల పార్వేట ఉత్సవం కన్నులపండువగా జరిగింది. కొండపేటలోని ఉమామహేశ్వర ఆలయం నుంచి ఉత్సవమూర్తులను నందివాహనంలో తీసుకెళ్లారు. యువకులు కర్రసాము ప్రదర్శించగా మంగళవాయిద్యాలు, బాణసంచాల నడుమ ఉమామహేశ్వరులు పల్లకిని మోసుకుంటూ పెన్నాతీరానికి తీసుకువచ్చి నిలిపారు. పార్వేట ఉత్సవానికి వచ్చినవారంతా ఉమామహేశ్వరులను దర్శించుకున్నారు. వేల సంఖ్యలో ప్రజలు పార్వేట ఉత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం 4గంల నుంచి 7గంటల వరకు ఎటు చూసినా పెన్నాతీరం జనసంద్రమైంది. ఓ వైపు యువకుల కబడ్డీ ఆటలు, చిన్నారుల గాలిపటాలు ఎగురవేత, ఇస్కాన్ వారి భజనలు, మహిళల ఆటలు, పాటలు ఓ వైపు వచ్చినవారికి అల్పాహార వితరణ, పెద్దల ఇష్టాగోష్టి, స్నేహితుల సరదాల కబుర్లు, బంధుమిత్రుల ఆప్యాయత అభిమానుల పలకరింపులు, పాత కొత్త అన్న తేడా లేకుండా పార్వేట ఉత్సవమంతా ఆనందమయమైంది.



కడప నగరంలోని మరియాపురంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు



టంగుటూరు పార్వేట ఉత్సవంలో ఆకట్టుకున్న కాళికాశక్తి వేషధారణ



ప్రతి ఇంట్లో సిరులు నిండాలి : కలెక్టర్



గంగిరెద్దుకు పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీధర్ దంపతులు

కడప కలెక్టరేట్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి గుమ్మంలో సంక్రాంతి లక్ష్మి కొలువై, ప్రతి కుటుంబంలో సంతోషాల సిరులను నింపి భోగభాగ్యాలను ప్రసాదించాలని కలె క్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆకాంక్షించారు. మంగళవారం కలెక్టర్ కుటుంబ సభ్యు లతో కలిసి మకర సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. హరిదాసుల సందళ్లతో బంగ్లాలో కి వచ్చిన గంగిరెద్దుకు కలెక్టర్ దంపతులు పసుపు కుంకుమ, నూతన వస్త్రాలను స మర్పించి సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి గంగిరెద్దుల యజమానికి సంక్రాంతి కా నుకలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి మన సంస్కృతి, సంప్రదాయా లను ప్రతిబింబించే పండుగ అన్నారు. వ్యవసాయ ఆధారిత జీవనం, సాగించే తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందన్నారు. కొత్త పంటలు చేతికందిన రైతులు ఇంటి నిండా ధాన్య సిరులు, సంపదల మధ్య ఆనందంగా చేసుకునే పండుగే సంక్రాంతి అన్నారు. సనాతన సంప్రదాయాలను గుర్తుకు తెచ్చి అల్లుళ్ల బంధు మిత్రులతో సరదాగా చేసుకునే పండుగన్నారు. ఈఏడాది ప్రకృతి అన్ని విధాలా కరుణించి జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి, సిరుల పంటలు పండాలని, ప్రజలం తా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

18న సీఎం చంద్రబాబు మైదుకూరు రాక



చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప/మైదుకూరు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 18వ తేదీ శనివారం మైదుకూరు రానున్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా.. రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను చెత్త రహిత మున్సిపాలిటీలుగా మార్చాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇందులో భాగంగా మైదుకూరును చెత్త రహిత మున్సిపాలిటీగా చేయనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు మైదుకూరులో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేయనున్నారు. ఇక జిల్లా అభివృద్ధికి సంబంధించి రివ్యూ చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ డేటా తయారు చేశారు. కాగా.. 18వ తేదీన సీఎం పర్యటన కోసం బుధవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మేధా డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌తో పాటు మరికొన్ని ప్రదేశాలను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐలు, ఎస్ఐలు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పండుగ సమయంలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి



ప్రమాదంలో మృతి చెందిన కోన సుమంత్, పగడాల సందీప్ (ఫైల్)

బద్వేలు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేళ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మిత్రులు చనిపోయారు. దీంతో అగ్రహారంలో విషాదం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. బద్వేలు మండలం అగ్రహారానికి చెందిన పగడాల సందీప్(23), మైదుకూరు మండలం రాయప్పగారిపల్లెకు చెందిన కోన సుమన్ (22) బాల్యమిత్రులు. పగడాల సందీప్ నెల్లూరు పట్టణంలో ఫొటోగ్రాఫర్‌గా ఉండేవాడు. సంక్రాంతి పండుగ కావడంతో తన సొంత గ్రామం అగ్రహారానికి వచ్చాడు. మైదుకూరు మండలం రాయప్పగారిపల్లె గ్రామానికి చెందిన కోన సుమంత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇతను తన అమ్మమ్మ ఊరు అయిన అగ్రహారానికి సంక్రాంతి పండుగకు వచ్చాడు. స్నేహితులు ఇద్దరూ కలసి మంగళవారం ద్విచక్రవాహనంపై గుండంరాజుపల్లెకు వెళ్లి తిరిగి వస్తుండగా మలుపు వద్ద వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ వెంటనే 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే సుమంత్ మృతిచెందాడని చెప్పారు. ప్రథమ చికిత్స అనంతరం సందీప్‌ను కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన చోటు చేసుకోవడంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నా యి. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు మృతి చెందడంపట్ల రెండు కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురయ్యాయి. ఈ మేరకు బద్వేలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గండికోట బ్యాక్‌వాటర్‌లో దారి తప్పారు

- కాపాడిన పోలీసులు

కొండాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గండికోట బ్యాక్ వాటర్‌ను చూడటానికి వెళ్లి ఐదుగురు వ్యక్తులు దారితప్పారు. బుధవారం సాయంత్రం ముద్దనూరుకు చెందిన అల్తాఫ్, కౌశిక్, గురివిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పవన్ అనే ఐదుగురు గండికోట బ్యాక్‌వాటర్‌లో అందాలను చూడటానికి రెండు తెప్పల్లో వెళ్లారు. ప్రాజెక్టులో నీళ్ల ఎక్కువగా ఉండటంతో కొద్ది దూరం వెళ్లేసరికి భయపడిపోయారు. నీళ్లలో ఇరుక్కున్నట్టు రాత్రి 8 గంటల ప్రాంతంలో పోలీసులకు ఫోన్ చేసి తమను రక్షించమని వేడుకున్నారు. పోలీసులకు వారు లైవ్ లొకేషన్ షేర్ చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. బ్యాక్ వాటర్‌కు దగ్గరగా గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైన రేగడిపల్లె ప్రాంతంలో వారి బోట్లు వెళుతున్నట్లు పోలీసులు లొకేషన్ ఆధారంగా గుర్తించారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ మహమ్మద్‌రఫీ సిబ్బంది బ్యాక్‌వాటర్ వద్దకు చేరుకుని రాత్రి 10 గంటల ప్రాంతంలో లైటింగ్ సహాయంతో వారిని అప్రమత్తం చేస్తూ రేగడిపల్లె ప్రాంతంలో ఒడ్డుకు చేర్చారని కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

వేంపల్లె మండలంలో బరిలో తలపడుతున్న కోళ్లు



లింగాల మండలం దొండ్లవాగులో జరిగిన కోడిపందేలు



కత్తులు దూసిన కోళ్లు

కడప, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటే మూడు రోజుల పాటు కన్నులపండువగా చేసుకునే పండుగ. భోగి రోజు కొన్ని ప్రాంతాల్లో కోడిపందేలు ఆడించడం కొంతకాలంగా సాగుతోంది. కానీ ఈ సంక్రాంతికి పులివెందుల నియోజకవర్గంలో భారీ స్థాయిలో కోడిపందేలు సాగాయి. ముఖ్యంగా వేంపల్లె, చక్రాయపేట, లింగాల, పులివెందుల మండలాల్లో విచ్చలవిడిగా నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తున్న ప్రదేశంలో కొన్నిచోట్ల మూడుముక్కలాట (మంగతాయి) కూడా ఆడించారు. చక్రాయపేట మండలంలో చిలేకాంపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె.. వేంపల్లె మండలంలో తువ్వపల్లె, రామిరెడ్డిపల్లె, గిడ్డంగివారిపల్లె గ్రామాల్లో కోడిపందేలు సాగాయి. అలాగే లింగాల మండలంలోని మురారిచింతల, దొండ్లవాగులో కోడిపందేలు సాగాయి. పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, చిన్నరంగాపురం, వెంకటాపురం, పులివెందుల-ఉలిమెల్ల రహదారిలో ఇలా దాదాపు 12 చోట్ల కోడిపందేలు నిర్వహించారు. వేంపల్లె మండలంలో సాగిన ఓ చోట కోడిపందేలకు వచ్చిన వారికి భోజన ఏర్పాట్లు, తాగునీటి వసతి సైతం కల్పించారు. అలాగే మందుబాబులు మద్యం కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా అక్కడే మందు విక్రయాలు కూడా సాగాయి. లింగాల మండలంలోని దొండ్లవాగు సమీపంలో సాగిన కోడిపందేలు నియోజకవర్గంలోనే హైలెట్‌గా నిలుస్తున్నాయి. ఈ ఒక్క చోటే దాదాపు సంక్రాంతి, కనుమ రెండు రోజులు రూ.5కోట్ల నుంచి రూ.6కోట్ల మేర పందేలు సాగినట్లు సమాచారం. భోగిరోజు వేములలో కోడిపందేలు నిర్వహించినా.. మిగిలిన రెండురోజులు పందేలు సాగలేదు.

మూడు జిల్లాల నుంచి

పులివెందులలో కొందరు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సాగిన కోడిపందేలకు మూడు జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చినట్లు సమాచారం. జిల్లాలోని కడప, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు తదితర నియోజకవర్గాల నుంచి వచ్చారు. అలాగే అనంతపురం జిల్లాలోని అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం నుంచి, సత్యసాయి జిల్లా నుంచి ముదిగుబ్బ, కదిరి, తలుపుల తదితర ప్రాంతాల నుంచి, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, నందలూరు ప్రాంతాల నుంచి పందెంకోళ్లతో పులివెందులకు వచ్చినట్లు సమాచారం. వేముల మండలంలో మొదటి రోజు పందేలు సాగినా తర్వాత రెండురోజులు సాగలేదు. తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో కోడిపందేలు జరగలేదు. వేంపల్లె మండలంలో కోడిపందేల వద్ద మందుబాబులు మా కోడి గెలిచిందంటే మా కోడి గెలిచిందని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అలాగే గిడ్డంగివారిపల్లెలో కూడా పందేల విషయంలో గొడవ జరిగింది. వేముల మండలంలో జరిగిన కోడిపందేలపై ఆ పోలీస్‌స్టేషన్‌లో ఐదుగురిపై కేసు నమోదు చేసి నాలుగుకోళ్లను, రూ.13వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కరోజు మాత్రమే కోడిపందేలు జరిగిన చోటే కేసు నమోదైతే.. మూడు రోజుల పాటు సాగిన కోడిపందేలపై పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారో అంతుబట్టని ప్రశ్న. పులివెందుల డీఎస్పీ మురళినాయక్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందం ఏర్పాటుచేశారు. ఆ బృందం సింహాద్రిపురం, తొండూరు, వేంపల్లె, చక్రాయపేట మండలాల్లో పర్యటించినట్లు సమాచారం. పులివెందుల నుంచి సింహాద్రిపురం వెళ్లే దారిలో రోడ్డుపక్కనే దొండ్లవాగు వద్ద కోడిపందేలు నిర్వహిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

> పులివెందుల నియోజకవర్గంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన కోడిపందేలలో ఏకంగా కోట్ల రూపాయలు చేతులు మారాయి. పులివెందులలో టీడీపీ కొత్త సంస్కృతికి నాంది పలికింది. కోడిపందేల నిర్వహణ అంతా ఆ నియోజకవర్గంలోని కొందరు టీడీపీ నేతల కనుసన్నల్లోనే జరిగింది. దాదాపు రూ.40కోట్ల నుంచి రూ.50కోట్ల మేర కోడిపందేలు సాగాయి. పులివెందులలో అంత భారీగా రాయలసీమలో మరెక్కడా సాగలేదని కొందరు టీడీపీ నేతలే బహిరంగంగా అంటున్నారు.

కడప ఆర్జేడీగా శామ్యుల్



కడప ఎడ్యుకేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కడప ప్రాథమిక విద్య రీజనల్ డైరెక్టర్ (ఆర్జేడీ)గా కె.శామ్యుల్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. కర్నూలు రెగ్యులర్ డీఈఓ అయిన ఈయన కడప ఇన్‌చార్జి ఆర్జేడీగా పనిచేస్తున్నారు. అయితే ప్రభుత్వం పదోన్నతులు కల్పిస్తూ కడప రెగ్యులర్ ఆర్జేడీగా నియమించింది.

రాత్రికి రాత్రే కొల్లగొట్టేశారు

- 3500 టన్నుల బెరైటీస్ అక్రమ తరలింపు
- రూ.10 కోట్ల నుంచి రూ.15కోట్ల విలువ

పులివెందుల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన బెరైటీస్ (ముగ్గురాయి) రాత్రికి రాత్రే కొల్లగొట్టేశారు. దాదాపు 3500 టన్నుల ముగ్గురాయి టిప్పర్ల సాయంతో వేరొక ప్రాంతానికి తరలించారు. దీని విలువ దాదాపు రూ.10 కోట్ల నుంచి రూ.15కోట్లు ఉంటుందని అధికారిక అంచనా. వివరాలిలా..

పులివెందుల నియోజకవర్గం వేముల సమీపంలో కొండపైన దాదాపు 16ఏళ్ల క్రితం వెలికితీసిన ముగ్గురాయి కుప్పగా వేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో టిఫెన్ కంపెనీ అనుమతులు తీసుకొని ఈ ముగ్గురాయిని వెలికితీసింది. అనంతరం అనుమతులు రద్దుకావడంతో అప్పటికే వెలికితీసిన ఈ ముగ్గురాయిని టిఫెన్ కంపెనీ వేరొక ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నించినా అప్పట్లో ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో అక్కడే ఉంచేశారు. కొన్నిరోజుల పాటు టిఫెన్ కంపెనీ వాచ్‌మేన్లను ఏర్పాటు చేసింది. అనంతరం ఎస్పీ ఆధ్వర్యంలో ఈ ముగ్గురాయికి భద్రత ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమేర అక్రమార్కుల పాలైంది. నిన్నా మొన్నటి వరకు దాదాపు 3500 టన్నుల ముగ్గురాయి అక్కడే నిల్వ ఉంది. సంక్రాంతి పండుగ రోజు మంగళవారం అర్ధరాత్రి టిప్పర్ల సాయంతో ఈ ముగ్గురాయిని తరలించారు. కన్జర్వేటర్ సాయంతో టిప్పర్లకు లోడ్ చేసి తెల్లవారేసరికి అక్కడున్న ముగ్గురాయిని మరో ప్రాంతానికి తరలించారు. ఇందులో నియోజకవర్గంలోని ముగ్గురు నాయకుల హస్తం ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఏడీఎంజీ అధికారులు బుధవారం పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అక్రమంగా తరలిపోయిన ముగ్గురాయి దాదాపు రూ.10 కోట్ల నుంచి రూ15 కోట్లు విలువ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కసారిగా ఇంత పెద్దఎత్తున ముగ్గురాయిని కొల్లగొట్టడం వెనుక బలమైన నాయకుల పాత్ర ఉంటుందని పోలీసులు అంటున్నారు.



వేముల వద్ద నిల్వ చేసిన ముగ్గురాయి (ఫైల్)

సబ్సిడీ రుణాలకు తెరుచుకోని వెబ్‌సైట్

● వరుస సెలవులతో మంజూరు కాని ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు

● అయోమయంలో ఆశావహులు ● నేటితో ముగియనున్న గడువు... పెంచాలంటూ విజ్ఞప్తి


పీలేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు' అన్నట్లుగా మారింది జిల్లాలోని స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈనెల 7వ తేదీ జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. అయితే అప్పటి నుంచి సంబంధిత పోర్టల్ తెరుచుకోకపోవడంతో పాటు రుణాల దరఖాస్తు కోసం కావాల్సిన ధృవీకరణ పత్రాలు సైతం సకాలంలో అందక చాలామంది నిరుద్యోగులు అయోమయంలో ఉన్నారు. ఒకవైపు రుణాల దరఖాస్తు కోసం ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగిసిపోతున్నా, సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి సానుకూల సమాధానం లేకపోవడంతో వారందరూ నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆ పోర్టల్ తెరుచుకోవడం లేదని, దరఖాస్తు ఆఖరు గడువును పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం భారీ నోటిఫికేషన్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రంగంలో ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7వ తేదీ అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో 1964 యూనిట్ల స్థాపన కోసం నోటిఫికేషన్ వెలువరించింది. అందులో జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 1350 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 67 యూనిట్లు, కమ్మ కార్పొరేషన్ ద్వారా 10 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 69 యూనిట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 14 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 13 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 379 యూనిట్లు, కాపు ఎంఎస్ఎంఈ గ్రూపు రుణాలు 3 యూనిట్లు మంజూరు చేశారు. వీటిలో యూనిట్ ఖరీదు రూ.5 లక్షలు కాగా, 50 శాతం సబ్సిడీ ఉంటుంది. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణంగా లభిస్తుంది. అవి కాకుండా జనరిక్ మందుల షాపుల కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా 30 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 9 యూనిట్లు, కమ్మ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 11 యూనిట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 1 యూనిట్ మంజూరు చేశారు. జనరిక్ మెడిసిన్ దుకాణం యూనిట్ ఖరీదు రూ.8 లక్షలు కాగా సబ్సిడీ రూ.4 లక్షలు, బ్యాంకు రుణం రూ.4 లక్షలు లభిస్తుంది.

నేటితో ముగియనున్న గడువు

రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ లోపు తమ ఆధార్, రేషన్ కార్డు, ఆధాయ, కుల ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరీ సిస్టం (ఏపీఓబీఎంఎంఎస్) అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహణ సంచాలకులు శిరీషా తన ప్రకటనలో తెలిపారు. అయితే ఆరోజు నుంచి బుధవారం రాత్రి వరకు కూడా ఆ వెబ్‌సైట్ పూర్తిగా తెరుచుకోలేదని ఆశావహులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా



'కమింగ్ సూన్' అంటూ చూపుతున్న ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్

'కమింగ్ సూన్' అని మాత్రమే కనిపిస్తోందని, అంతకు మించి ఎటువంటి సమాధానం రావడం లేదని వారు వాపోతున్నారు. దానికితోడు రెవెన్యూ సదస్సులు, వరుస సెలవుల కారణంగా రెవెన్యూ అధికారులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల మంజూరులోనూ విపరీతమైన జాప్యం చేశారని వారు తెలిపారు. వాటి కారణంగానూ తాము దరఖాస్తు చేసుకోలేకపోయామని వారు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. గడువును మరో 10 రోజులు పెంచాలని, ఏపీఓబీఎంఎంఎస్ వెబ్ సైట్‌ను పూర్తిగా అందుబాటులోకి తేవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండడంతో ఎంత మంది దరఖాస్తు చేశారో స్థానిక అధికారులకు తెలియడం లేదు. ఒకరిద్దరు ఆశావహులు మాత్రం తమకు ఫోన్ చేసి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు తెలియజేశారని వారు చెబుతున్నారు.

బాలసాహిత్యం విజ్ఞానానికి సోపానం



చిట్టిచేతులు బాలల కథల పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలసాహిత్యం విజ్ఞానానికిసోపానం అని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. తెలుగు భాషోపాధ్యాయులు పల్లా వెంకటరామారావు రచించిన చిట్టిచేతులు పుస్తకావిష్కరణ బుధవారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ బాలల కథలు పిల్లలకు ప్రపంచజ్ఞానాన్ని, మంచి, చెడు విచక్షణను తెలియజేస్తాయన్నారు. బాలలకోసం రచయిత చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ పిల్లలను నైతిక విలువల అభివృద్ధికి, సమాజం పట్ల అవగాహనకు, మంచి నడవడికకు బాలల కథలు తోడ్పడుతాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహిత డీకే చదువులబాబు మాట్లాడుతూ పిల్లలతో బాల సాహిత్యం చదివించడం వలన వారిలో మంచి అలవాట్లను పెంపొందించవచ్చునని తెలిపారు. రచయిత పల్లా రామారావు మాట్లాడుతూ నేటితరం పిల్లలు బాలసాహిత్యాన్ని చదవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కవి ఏసీ దస్తగిరి, రచయితలు కొమ్మిశెట్టి మోహన్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, జింకా సుబ్రమణ్యం, కొత్తపల్లె శ్రీను, బండారు రఘురామయ్య, పల్లా శేషయ్య, బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన సినిమా ప్రదర్శన.. ప్రేక్షకుల ఆందోళన

కడప క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలోని గ్రూప్ థియేటర్లలో వెంకటేశ్, ఐశ్వర్యారాజేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ప్రదర్శన ఓ హాలులో జరిగింది. అరగంట తరువాత టెక్నికల్ ఇష్యూతో సినిమా ప్రదర్శన ఆగిపోయింది. దీంతో ప్రేక్షకులు హాలు ఎదుట ఆందోళనకు దిగారు. డబ్బు చెల్లించాలంటూ థియేటరు యాజమాన్యంతో వాగ్వావాదానికి దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రేక్షకులకు సర్దిచెప్పే యత్నం చేశారు. తాము చెల్లించిన డబ్బు వెనక్కి ఇవ్వాలని డిమండ్ చేశారు. దీంతో హాలు యాజమాన్యం టికెట్ కొనుగోలు చేసిన వారికి డబ్బు చెల్లించారు. ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేసిన వారికి మొదట ఇవ్వకపోవడంతో తరువాత పోలీసులు జోక్యం చేసుకుని ఆ యాప్‌ల ద్వారా మాట్లాడి తిరిగి టికెట్ కొనుగోలు చేసిన వారికి తిరిగి పంపించడంతో సద్దుమణిగింది. ఈ ఘటన మంగళవారం రాత్రి 9.30గంటలకు చోటు చేసుకుంది. అయితే సెకండ్‌షో యదావిధిగా రన్ చేశారు.

పీపీ1, పీపీ2 తరగతులు ప్రారంభించాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ మీడియం, ఉర్దూ సెక్షన్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పీపీ1, పీపీ2 తరగతులు ప్రారంభించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని నగరపాలక ఉర్దూ పాఠశాల (సాలె నాగయ్య)లో రూట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనర్ మీడియా ఉర్దూ ఫౌండేషన్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:15గా ఉంచాలని, 45 మంది విద్యార్థులు ఉన్నత ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, అసోసియేట్ అధ్యక్షుడు సత్తార్ ఫైజీ, షాహిదుల్లా మాట్లాడారు. రాష్ట్ర డైరీ కమిటటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీం సాహెబ్, ఉపాధ్యక్షుడు అఫ్జల్ బాష మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను రెగ్యులర్ చేసి ఉర్దూ ఆచార్య పోస్టులు మంజూరు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ మస్తాన్ వలి, బేపారీ ఫక్రుద్దీన్ ప్రసంగించారు. ప్రముఖ కవి మఖ్బూల్ అహ్మద్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు... యువకుడు మృతి



పోరుమామిళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో బుధవారం మోటారు బైకును కారు ఢీకొనడంతో సురేశ్ (25) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పేరమ్మగారిపల్లెకు చెందిన సురేశ్ మోటారుబైకులో పోరుమామిళ్లకు వస్తుండగా కమ్మవారిపల్లె గ్రామ సమీపంలో బద్వేలు వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీ... వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో సోమవారం రాత్రి పని ముగించుకుని అమ్మచెరువు మిట్టకు వెళుతున్న రామస్వామి (64)ని ఆటో ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. శవపరీక్ష కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. వన్‌టౌన్ వన్‌టౌన్ సీఐ ఎరిషావలి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృ తునికి భార్య లక్ష్మీదేవి, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు...

బి.కొత్తకోట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... బి.కొత్తకోట పట్టణం బెంగళూరు రోడ్డులోని బీసీ కాలనీలో నివాసం వుండే జరిపిటి కేశవ కుమారుడైన జరిపిటి గణేష్(24) చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా వుండేవాడు. సోమవారం సొంతపనుల నిమిత్తం కర్నాటక సరిహద్దున వున్న ఓ గ్రామానికి వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి పొద్దుపోయాక బి.కొత్తకోటకు ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణంలో రానామిట్ట చెక్‌పోస్టు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరు కొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మదనపల్లె ఏరి యా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పేర్కొన్నారు.

ఆటో-స్కూటర్ ఢీ... ఒకరు

రాయచోటి టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం జగనన్న కాలనీకి సమీపంలో బుధవారం సాయంత్రం ఆటో, స్కూటర్ ఢీకొన్న ప్రమాదంలో సిద్దిఖ్(23) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం శిబ్యాల గ్రామం కస్పాకు చెందిన అల్లాబకష్ కుమారుడు సిద్దిఖ్, శిబ్యాల నుంచి రాయచోటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జగనన్న కాలనీ సమీపంలోకి రాగానే రాయచోటి వైపు నుంచి ప్రయాణీకులతో వెళుతున్న ఆటో ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దిఖ్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఎమ్మెల్యే ఎదుటే టీడీపీ వర్గీయుల వాగ్వాదం



బ్యానర్‌లోని శ్రీనివాసులు ఫోటోను కాల్చిన దృశ్యం

చాపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఎదుటనే టీడీపీ వర్గీయులు ఒకరిపై మరొకరు తోసుకుని వాగ్వాదానికి దిగారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే వెదురూరు గ్రామానికి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఎమ్మెల్యే రాజుపాళెం గ్రామం వద్ద కొద్దిసేపు వాహనం నిలబెట్టారు. ఎమ్మెల్యేతో మాట్లాడటానికి వారు పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో రాజుపాళెం గ్రామానికి చెందిన పల్లెం శ్రీనివాసులు, గోర్ల సుబ్బరాయుడు, నరహరిపురం గ్రామానికి చెందిన నందిమండలం పవన్‌కుమార్‌రెడ్డిల మధ్య కొద్దిసేపు తోపులాట, వాగ్వాదం జరిగింది. పక్కనే ఉన్న ఇతర టీడీపీ నాయకులు ఘర్షణ జరుగకుండా సర్దుబాటు చేశారు. మళ్లీ సాయంత్రం నరహరిపురం గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ వర్గీయులు రాజుపాళెం గ్రామానికి వచ్చారు. మళ్లీ ఘర్షణ జరుగుతుందేమోనని విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్న పెద్దయ్య పోలీసు సిబ్బందితో వచ్చి వారిని చెదరగొట్టారు. అప్పటికే పల్లెం శ్రీనివాసులుకు చెందిన ఫొటోను బ్యానర్‌లో కాల్చివేశారు. ఎమ్మెల్యే ఫొటో గోర్ల సుబ్బరాయుడు, పసల రమణ, నరసింగు ఓబులేసు, ఇంకా కొంత మంది ఫొటోలను కలిగి ఉన్న బ్యానర్‌ను పూర్తిగా చించివేశారు. దీంతో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయా ందోళనలో గ్రామస్థులు ఉన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ అడుగగా ఈ సంఘటన జరిగిన విషయం నిజమేనన్నారు. వారు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితాన్ని భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవికుమార్ సమాచారం మేరకు.. టి.సదుం పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు వెంకట్రమణ (50) భార్య ప్రమీల అనారోగ్యంతో 8 నెలల క్రితం ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందింది. ఆ తరువాత కుమార్తెకు వివాహం చేసి కుమారుడిని పోషించుకుంటూ ఒంటరిగా జీవిస్తూ ఉండేవాడు. సంక్రాంతి రోజు భార్య లేదని మనస్థాపం చెందాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది కాలనీ సమీపంలో ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

తిరుమలలో విషాదం

● భవనంపై నుంచి కిందపడి బాలుడి మృతి



తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. ఆడుకుంటూ భవనంపై నుంచి కిందపడి మూడేళ్ల బాలుడు మృతిచెందాడు. పోలీసులు, విజిలెన్స్ వివరాల మేరకు.. కడప జిల్లా చిన్నచౌక్‌కు చెందిన శ్రీనివాసులు, కృష్ణవేణి దంపతులు తమ ఇద్దరు కుమారులు నిహాంత్, సాత్విక్ శ్రీనివాసరాజు(3)తో కలిసి శ్రీవారి దర్శనార్థం 13న తిరుపతికి చేరుకున్నారు. 14వ తేదీ తిరుపతిలో 16వ తేదీకి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు పొంది బుధవారం ఉద యం తిరుమలకు చేరుకున్నారు. ఈక్రమంలో తిరుమల ఆర్టీసీ బస్టాండ్‌లోని పద్మానాభ నిలయంలోని లాకర్‌ను పొందారు. తలనీలాల సమర్పణ అనంతరం వరాహస్వామిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి లాకర్ వద్దకు చేరుకున్నారు. సాయంత్రం అన్న నిహాంత్‌తో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సాత్విక్ రెండవ అంతస్తులోని మెట్ల రైలింగ్ మధ్య ఖాళీ నుంచి కిందపడిపోయాడు. గుర్తించిన శ్రీనివాసుల దంపతులు వెంటనే తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. కాసేపటికే బాలుడు మృతి చెందాడు. బిడ్డ మరణంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. 2టౌన్ పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల దరఖాస్తుల గడువు పొడిగింపు

కలికిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి కలికిరి సైనిక్ స్కూల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు పంపుకోవడానికి పది రోజుల గడువు పొడిగిస్తూ నేషనల్ టెస్టిం గ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నోటిఫికేషన్ జారీ చేసింది. సైనిక్ స్కూల్లో ఆరు, తొమ్మిదవ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న అర్హత పరీక్షలు రాయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు పంపుకోవడానికి ఈ నెల 13 గడువుగా ప్రకటించారు. తాజాగా ఈ గడువును ఈ నెల 23 తేదీకి పొడిగిస్తూ ప్రకటన జారీ చేసింది. దీనికి అనువుగానే గతంలో ఫీజు చెల్లించడానికి 14వ తేదీగా వున్న గడువును 24వ తేదీ రాత్రి 11.50 గంటలకు పొడిగించారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తుల్లో ఏవేనా లోపాలుంటే వాటిని సరిదిద్దుకోవడానికి కూడా గతంలో 16వ తేదీ నుంచి 18వ తేదీలోగా అవకాశమిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ కోసం కూడా 26 నుంచి 28వ తేదీలోగా సవరించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. కాగా విద్యార్థుల ఆధార్ కార్డు ఆధారంగా దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాల్లో అభ్యర్థి పేరు, ఫొటో, సంతకం, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ, చిరునామాలు, పరీక్షా కేంద్రాలను మార్చుకోవడానికి మాత్రం అవకాశం లేదు. అయితే జండ ర్, పుట్టిన తేదీ, కేటగిరీ, మీడియమ్, తల్లిదండ్రుల పేర్లు మార్చుకోవడానికి అవకాశమిచ్చారు. ఇక ఆధార్ వివరాలతో లేని దరఖాస్తుల్లో కూడా పైవిధంగానే మార్పుటు చేసుకోవడానికి అవకాశముంది.

అందుబాటులోని సీట్లు

కలికిరి సైనిక్ స్కూల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం అందుబాటులో వున్న సీట్ల వివరాలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ స్కూల్లో మొత్తం ఆరవ తరగతిలో ప్రవేశాలకు 106, తొమ్మిదవ తరగతిలో ప్రవేశాలకు 16 సీట్లు అందుబాటులో వున్నాయి. ఇందులో ఆరవ తరగతిలో బాలికలకు 10 సీట్లు కేటాయించారు. తొమ్మిదవ తరగతిలో బాలికలకు ఒక సీటు మాత్రం అందుబాటులో వుంది. ఇవి కాకుండా ఎస్వీఎస్ నెల్లూరులోని ఆదాని వరల్డ్ స్కూల్లో (డే స్కూల్) ఆరవ తరగతిలో 80 సీట్లు, తొమ్మిదవ తరగతిలో 66 సీట్లు కూడా అందుబాటులో వున్నాయి.

పరీక్షా కేంద్రాలు

కలికిరి, కోరుకొండ సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్షల కోసం అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, శ్రీకాకు ళం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

సిద్దవటం కోటను సందర్శించిన కలెక్టర్



సిద్దవటం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పురావస్తుశాఖ పరిధిలో ఉన్న సిద్దవటం కోటను మంగళవారం కలెక్టర్ శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. కోటలోని 1, 2 మండపాలు, కోట ముఖద్వారం, పార్కు, కామాక్షి ఆలయం, రాణి స్నానపు వాటిక, రాజు మహల్, రాణిమహల్, బిస్మిల్లా షావలి దర్గా, శివ లింగం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలోని శిల్పా లు అద్భుతంగా ఉన్నాయన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మాధవరంలో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

సిద్దవటం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తన ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహరించుకు వెళ్లారని మాధవరంలోని పార్వ తీపురం ప్రాంతానికి చెందిన పెంచలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు తన అత్త నరసమ్మ కడపలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో ఆమెను చూసేందుకు శనివారం రాత్రి వెళ్లామని, సోమవారం ఉదయం తమ ఇంటి ఎదురుగా ఉన్న మల్లమ్మ ఫోన్ చేసి.. తమ ఇంటి తలుపులు తెరిచి ఉన్న విషయం తెలపడంతో 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం పోలీసులు విచారణ చేపట్టగా.. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బచంద్ర తెలిపారు.

ఆణిముత్యాలు

● అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో మెరిసిన యువక్రీడాకారిణులు ● బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు





జంప్‌రోప్ చాంపియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన భువనశ్రీ, ఆషియా

దువ్వూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో యువ క్రీడాకారిణులు తమ సత్తా చాటి పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. ఆ యువ క్రీడాకారిణుల గురించి తెలుసుకోవాలంటే...

దువ్వూరు మండలంలోని రాంసాయినగర్ అనే మారు మూల గ్రామంలో భువనశ్రీ జన్మించింది. తల్లిదండ్రులు సాధారణ వ్యక్తులు. తండ్రి జీపు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. పేద కుటుంబంలో జన్మించిన భువనశ్రీ నంద్యాల జిల్లాలోని ఏపీఎం మోడల్‌స్కూలులో 8వ తరగతి చదువుతోంది. ఈ అమ్మాయి క్రీడలపట్ల ఆసక్తి కనపరచడంతో అక్కడి స్పోర్ట్స్ కోచ్‌లు షేక్ గౌస్, పక్కీరయ్య, వెంకటసుబ్బయ్య గమనించి.. జంప్‌రోప్ శిక్షణ అందించారు.

ఈ నేపథ్యంలో ఈనెల 6 నుంచి 8 వరకు నేపాల్‌లోని ఫోక్రా నగరం రంగశాల స్టేడియంలో ఇంటర్నేషనల్ స్థాయిలో లాంగ్‌రోప్ పోటీలు జరిగాయి. 30 సెకన్ల సైక్లింగ్ పోటీతో పాటు లాంగ్‌రోప్ (ఎల్ఆర్ఎస్) పోటీలో పాల్గొని రెండింటిలో గోల్డ్‌మెడల్స్ సాధించి.. ప్రశంసలు అందుకుంది. ఈ పోటీల్లో ఇండియా, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ దేశాల నుంచి 22 విభాగాల్లో 1400 మంది ఆయా దేశాల్లోని ప్రతిభావంతులు పోటీ పడ్డారు. అందులో భువనశ్రీ రెండు బంగారు పతకాలు సాధించడం విశేషం.

జపాన్‌లో పోటీలకు ఆహ్వానం

జపాన్‌లోని కవాసకిలో జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలని భువనశ్రీకి ఆహ్వానం అందింది. అయితే ఈ అమ్మాయి తన కుటుంబానికి పేదరికం అడ్డు తగులుతోందని ఆవేదన వెలిబుచ్చుతోంది. తన తండ్రి సాయిప్రసాద్ సాధారణ బస్సు డ్రైవర్ అని, కష్టపడి తనను ఇంతవరకు ప్రోత్సహించారని తెలిపింది. జపాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొనాలంటే కనీసం రూ.3లక్షలు అయినా ఖర్చు అవుతుందని తన తండ్రికి అంత స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దాతలు ప్రోత్సహిస్తే జపాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటానని భువనశ్రీ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఆషియాకు... పసిడి పతకాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్లామిక్ హైస్కూలుకు చెందిన 6వ తరగతి విద్యార్థి పి.ఆషియా అంతర్జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీల్లో తన ప్రతిభ చాటి పసిడి పతకాలు సాధించింది. ఈనెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు నేపాల్‌లోని పోక్రాన్‌లో జరిగిన 30 సెకన్ల సైక్లింగ్ పోటీతో పాటు లాంగ్‌రోప్ (ఎల్ఆర్ఎస్) పోటీలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఆ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాహిద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు హసీనా, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా, ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో బంగారు పతకం సాధించించింది.

అంబరాన్నంటిన సంబరాలు

రంగుల హరివిల్లు విరిసిన తెలుగు లోగిళ్లు ● సంక్రాంతి సంప్రదాయాలు మరువద్దు : ఎమ్మెల్యే ● జనసంద్రమైన పెన్నాతీరం ● వేడుకగా పార్వేట ఉత్సవం



సత్యనారాయణ స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

కడప కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అచ్చమైన తెలుగు పండగ సంక్రాంతి, ఈ పండుగలను సంప్రదాయ పద్ధతిలో జిల్లా ప్రజలు ఆనందంగా చేసుకున్నారు. కొత్త అళ్లుల్లు.... బంధు మిత్రులతో తెలుగు లోగిళ్లు కళకళ లాడాయి. ఇంటి ముంగిళ్లు రంగవళ్లులు, గొబ్బెమ్మలతో కొత్త సొబగులు దిద్దుకున్నాయి. కడప నగరం సహా మైదుకూరు, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు తదితర ప్రాంతాల్లో పిల్లలు, పెద్దలు ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నగరంలో వైభవంగా పార్వేట ఉత్సవాలు

కనుమ పండుగ పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నగరంలో పార్వేట ఉత్సవాలు నిర్వహించారు. వివిధ దేవాలయాల నుంచి స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సవంగా మున్సిపల్ మైదానంలోకి చేరుకున్నారు. నగర గడ్డిబజార్‌లో వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో పార్వేట మహోత్సవం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ భట్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరామ స్వామి ఆలయం, అమ్మవారి శాలలో తిరప్పావై పఠనం చేసి చివరి రోజు పార్వేట మహోత్సవంలో సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయ స్వామి వారు, వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఊరేగారు. పాండురంగ స్వామి దేవాలయం నుంచి పాండు రంగస్వామి లక్ష్మీ సమేతంగా వేంచేసి భక్తులను ఆశీర్వదించారు.

ఉమామహేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే

చెన్నూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు పండగ సంక్రాంతి అని, ఈ పండుగలను సంప్రదాయపద్ధతిలో చేసుకోవాలని, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను మరువద్దని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి అన్నారు. పార్వేట ఉత్సవం కోసం చెన్నూరుకు వచ్చిన ఆయన స్థానిక పార్టీ కార్యాలయం నుంచి చెన్నూరు కొండపేట వంతెన మీదుగా పెన్నానదిలోని పార్వేట ఉత్సవానికి వచ్చారు. ఉమామహేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి గాలిపటాలు ఎగురవేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, కొండపేట మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వర ఆలయ కమిటీ నిర్వాహకులు మాడిశెట్టి రవిశంకర్, కుంచెం రామిక్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, గుమ్మళ్ల మల్లి కార్జునరెడ్డి, జిల్లా బలిజ సంఘం నేతలు ఆకుల ప్రసాద్ బాబు, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మన్నూరు అక్బర్, వేల్పుల సుబ్రమణ్యం, కొండపేట సుధాకర్‌రెడ్డి, ఆవుల పవన్ కుమార్‌రెడ్డి, పాలగిరి సుదర్శన్‌రెడ్డి, చిన్నిక్రిష్ణారెడ్డి మండల నేతలు పాల్గొన్నారు.

కొక్కిరాయపల్లెలో...

కొక్కిరాయపల్లెలో సర్పంచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పార్వేట ఉత్సవం నిర్వహించారు. గ్రామంలో గొబ్బెమ్మలను ఊరేగించారు. మహిళలు అమ్మవారి వెంట పసుపు కుంకుమ చీరలతో సంప్రదాయద్దతిలో పార్వేట వరకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నియోజక వర్గ ఎస్సీ సెల్ నేత చెన్ను రాంప్రసాద్, మాజీ ఎంపీటీసీ వాసు దేవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి క్షేత్రంలో....

వల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ బుధవారం సాయంత్రం కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వాముల పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కొండ దిగువన ఉన్న పార్వతీ పరమేశ్వరులను, కొండపై ఉన్న లక్ష్మీ చెన్నకేశవస్వామిని అలంకరించి మేళతాళాలతో పంచమ నదీ సంగమం వద్దు వద్దకు తీసుకువచ్చారు. భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి పార్వేటలో కుందేలును వదిలిపెట్టారు. కుందేలను పట్టుకునేందుకు పరుగులు తీశారు. అనంతరం దేవదేవేరులకు మహా మంగళ హారతి గావించి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. యువకులు కబడ్డీ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు పెట్టి బహుమతులు అందించారు.

చదిపిరాళ్లలో ...

కమలాపురం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చదిపిరాళ్లలో శివపార్వతుల, వేణుగోపాలస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కనుమ సందర్భంగా సాయంత్రం పొలిమేరలో కుందేలు పార్వేట నిర్వహించారు. పాగేరు వంక వద్ద సంక్రాంతి సంబరాలను గ్రామ పెద్ద సహకారంతో ఘనంగా నిర్వహించారు, ఇక్కడ మహిళలకు ముగ్గుల పోటీలు యువతకు కబడ్డీ పోటీలు, మహిళలకు తాడాట, కుర్చీలాట నిర్వహించారు. విజేతకు బహుమతులు అందించారు.

చింతకొమ్మదిన్నె మండలంలో

సికెదిన్నె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రసూల్‌పల్లి, తదితర గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నాగమల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రసూల్‌పల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను ప్రజలు బంధుమిత్రులతో కలిసి ఆనందంగా చుసుకున్నారు.

గౌరమ్మకు పూజలు

గౌరమ్మకు మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు. నెల రోజులుగా అమ్మవారిని అలంకరించి ఇంటింటా తిరిగి గౌరమ్మకు పూజలు చేశారు. చివరి రోజు బుధవారం మహిళలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఊరేగించి మంగళవాయిద్యాలతో అమ్మవారిని నిమజ్జనం చేశారు. చింతకొమ్మదిన్నె, బయనపల్లె, నాగిరెడ్డిపల్లె, బుగ్గలేటిపల్లె, పడిగెలపల్లి తదితర గ్రామాల్లో గౌరమ్మకు మహిళలు పూజలు నిర్వహించి ఘనంగా నిర్వహించుకున్నారు.

వేంపల్లెలో....

వేంపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, కనుమ పండుగలు మండలంలో వేడుకగా చేసుకున్నారు. పలు చోట్ల ముగ్గులపోటీలు, ఎద్దుల బండలాగుడు పోటీలు కోలాహలంగా జరిగాయి. వృషభాచలేశ్వరస్వామి గ్రామోత్సవం వేంపల్లె పురవీధుల్లో సాగింది. వేంపల్లె బలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గౌరీదేవి ఆలయం వద్ద ముగ్గులపోటీలు నిర్వహించారు. 34 మంది పోటీల్లో పాల్గొనగా సంయుక్త మొదటి బహుమతి సాధించింది. కాంగ్రెస్ పార్టీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి, సతీమణి అలివేలు, కుమార్తె మాధురి, ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి ప్రతినిధులు పచ్చిపులుసు ప్రవీణ, పుల్లగూర సుప్రజ, బలిజ సంఘం ప్రతినిధులు నక్కా సరస్వతి, బాలం చైతన్యలక్ష్మి, నూనె సరళ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు సర్పంచు ఆర్.శ్రీను, సోదరుడు ఆర్.వేణు సహకారంతో బహుమతులు అందించారు. బలిజ సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, కుళాయప్ప, గౌరవాధ్యక్షుడు రెడ్డయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు. చింతలమడుగు పల్లెలో ఎద్దులతో బండలాగుడు పోటీలను టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి ప్రారంభించారు. మొదటిస్థానంలో నిలిచిన ఎద్దుల యజమాని చంటికి బహుమతిని అందించారు.



పంచమనదీ సంగమం వద్దున పార్వేటకు కుందేలును వదులుతున్న దృశ్యం - కమలాపురంలో బండలాగుడు పోటీలు - కుందేలును పట్టుకున్న యువకుడు - చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లెలో గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం



పట్టువస్త్రాలను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య

పెండ్లిమర్రి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి సందర్భంగా వెల్లటూరులో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. వెయ్యినూతన కోనలో లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. చెన్నకేశవ స్వామి కల్యాణంలో పుత్తా సాయి నరసింహ యశ్వంత్‌రెడ్డి, టీడీపీ నేతలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

బండలాగుడు పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. పేదబడుగు బలహీన వర్గాలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రజల కోసమే పనిచేసే పార్టీ టీడీపీ మాత్రమేనని స్పష్టం చేశారు. కడప అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తారని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డిని స్థానికులు సత్కరించారు.

శిల్పారామంలో సందడే సందడి



డ్యాన్స్ వేస్తున్న చిన్నారులు

కడప కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం నగర రిమ్స్ సమీప శిల్పారామం జనంతో సందడిగా మారింది. సంబంధిత పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో సాంస్కృతిక కళావేదికపై ప్రాచీన సంప్రదాయాలను గౌరవిస్తూ ఏ.ఎం. డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జానపద, భరత నాట్యం ప్రదర్శించారు. తదుపరి చిలకజోస్యం, హరిదాసు తదితర ప్రదర్శనలు చేశారు. మిస్సా మూవీ సహకారంతో జబర్దస్త్ కామెడీ స్కిట్స్‌తో కడుపుబ్బ నవ్వించారు.

కిక్కిరిసిన మాంసం అంగళ్లు



జట్కా మాంసం అంటూ బోర్డు పెట్టిన దుకాణం

చెన్నూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమపండుగ రోజు చెన్నూరులో మాంసం కోసం మాంసం ప్రియులు ఎగబడ్డారు. అటు చెన్నూరు పాత బస్టాండు, కొత్తరోడ్డు ప్రాంతంలో తెల్లవారుజామున 3గంటల నుంచే పొట్టేలు మాంసం, కోళ్లమాంసం విక్రయించడంతో అంగళ్ల వద్ద, తోపుడుబండ్ల వద్ద వందల సంఖ్యలో ప్రజలు మాంసం కొనేందుకు ఎగబడ్డారు. పైగా జట్కా మాంసం అంటూ కొత్తరోడ్డులో బోర్డు పెట్టి అమ్మకాలు జరిగాయి.

త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణ పనులు

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్కేనగర్‌లో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆర్కేనగర్ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందించి కార్పొరేషన్ అధికారులను పిలిపించి త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. మరికొన్ని సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంప్రదాయ పండుగలు చేసుకోవాలి



నిర్వాహకులు వెంకటసుబ్బయ్యను సత్కరిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. రాజీవ్‌నగర్ కాలనీ వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి పండుగ చేసుకున్నారు. వృద్ధులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు వెంకటసుబ్బయ్య, మాజీ దేవస్థాన చైర్మన్ రంగయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లింగాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గుణకనపల్లె వాసి హసీనా (40) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. లింగాల ఇన్‌చార్జి ఎస్ఐ నాగతులసీప్రసాద్ వివరాల మేరకు... హసీనా జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లి ఇటీవలే తిరిగివచ్చింది. ఆమెకు ఆర్థికపర సమస్యలున్నాయని సుమారు రూ.4లక్షలు అప్పులు ఉన్నాయని తిరిగి కువైట్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురు కాగా మనస్థాపానికి గురై ఈనెల 10వ తేదీన తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆమె మృతి చెందింది.

పండుగనాడూ పప్పన్నానికి కరవేనా?

చౌకదుకాణాల నుంచి అందని కందిపప్పు



కందిపప్పు ఇవ్వలేదని చెబుతున్న కార్డుదారులు

చెన్నూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పండుగ నాడు కాసింత పప్పన్నం చేసుకోవాలన్నా కందిపప్పు చౌక దుకాణాల్లో ఇవ్వడం లేదని చెన్నూరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక 8, 9 చౌక దుకాణాల్లో కందిపప్పు కార్డుదారులకు సరిపడా లేకపోవడంతో సగం ఆమాత్రమే రావడంతో డీలర్లు దానిని తీసుకుని పంపిణీ చేస్తే సగం మందికి ఇవ్వాల్సి వస్తుంది. మిగలిన సగం మందితో సమస్య అని వారు తీసుకోకుండా అలాగే ఉంచారు. దీంతో తెల్లకార్డులు కందిపప్పు తీసుకోలేకపోయారు. గత నెలలో కందిపప్పు ఇవ్వగా పండుగ పూటే ఎందుకు తక్కువ ఇచ్చారని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా కందిపప్పు ఇవ్వకపోవడంపై ప్రజలు పండుగ నాడు ఆవేదన చెందారు.

వృద్ధుల పట్ల కనికరం చూపండి

కడప కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతి ఒక్కరికీ జీవితంలో వృద్ధాప్యం తప్పదని, కావున వృద్ధుల పట్ల కాసింతైనా కనికరం చూపాల్సిన ఆవశ్యకత ఉందని టీడీపీ పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మాసా కోదండ రామ్ అన్నారు. కనుమ పర్వదినం, పెనుగొండ ఎంఎల్ఏ మంత్రి ఎస్.సవితమ్మ పుట్టిన రోజును పురస్కరించుకుని చౌడమ్మ వృద్ధాశ్రమం వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. టీడీపీ బీసీ నేతలు రామాం జనేయులు, విజయ్‌కుమార్, టీడీపీ నగర ప్రధానకార్యదర్శి జలతోటి జయకుమార్, వృద్ధాశ్రమ నిర్వాహకులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్పీ అధినేత మాయావతి జన్మదిన వేడుకలు

కమలాపురం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ అధినేత ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి పుట్టిన రోజు వేడుకలను కమలాపురంలో నిర్వహించారు. బుధవారం జిల్లా ఉపాధ్యక్షుడు బాలచంద్ర ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జయరాం కేక్ కట్ చేశారు కార్యక్రమంలో బీఎస్పీ మహిళా నాయకురాలు ఎస్.బేబి, టి.రవికుమార్, బాలనరసింహ, కదిరయ్య, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నగరాధ్యక్షుడిగా అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కడప నగర అధ్యక్షుడిగా మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఆర్యంలో అంజాద్‌బాషను సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పులి సునీల్‌కుమార్, కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కడప నాగరాజుపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పీస్ స్కూల్ విద్యార్థులు ది ప్రిన్స్ కప్ నేషనల్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటారు. ఈనెల 12న థియరీ వీకేస్పోర్ట్స్ స్టేడియం కగ్గదసాపురం, బెంగుళూరులో నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొని నాలుగు గోల్డ్, మూడు బ్రౌంజ్ మెడల్ సాధించారు. 6వ తరగతికి చెందిన షేక్ ఇబ్రహీం, ఇబ్రహీం ఖలీలుల్లా, సయ్యద్ సుహెల్, సీఎస్ ఇషాక్ కయోరూజీ పూమాసే గోల్డ్ మెడల్స్ సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్‌పీర్ తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.



కమలాపురం మండలం చదిపిరాళ్లలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు



చెన్నూరులో గౌరమ్మను పూజిస్తున్న మహిళలు

ఇరిగేషన్ సూపరింటెండెంట్‌కు గాయాలు

కడప క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ సూపరింటెంటెండెంట్ శ్రీనివాసులు రోడ్డు ప్రమాదానికి గురై గాయపడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కడప రాజారెడ్డివీధిలో ఉంటున్న శ్రీనివాసులు 3న రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఆయన చికిత్స పొందుతూ బుధవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు


బద్వేలు.. గొబ్బెమ్మను ఊరేగింపుగా తీసుకువస్తున్న అబ్బరాతివీధి మహిళలు



పోరుమామిళ్ల.. నాగులకుంట్లలో పార్వేటకు వెళుతున్న గ్రామస్థులు, మైలవరం... శ్రీరాముల స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం


ఎర్రగుంట్ల..భక్తులకు దర్శనం ఇస్తున్న ఆంజనేయస్వామి


ప్రొద్దుటూరు..పార్వేట ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


మైదుకూరు.. బృందావనం నృత్యంలో పాల్గొన్న కళాకారులు


బి.మఠం...పార్వేట కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజలు


కాశినాయన..ఆకులనారాయణపల్లెలో చౌడేశ్వరీదేవి గ్రామోత్సవం

● పలు చోట్ల వైభవంగా పార్వేట మహోత్సవం ● ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు


రాజుపాలెం.. వెల్లాలలో చెన్నకేశవ, శ్రీదేవి భూదేవి, భీమలింగేశ్వర, పార్వతీదేవి అమ్మవార్ల ఊరేగింపు ముందు చెక్కభజన

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):ప్రొద్దుటూరు మండల పరిధిలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంబరాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామం అయిన కామనూరులో అంగరంగ వైభవంగా పార్వేట మహోత్సవాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి కుమారుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డిలు ప్రసన్న వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పార్వేట ఉత్సవాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రసన్న వేణుగోపాలస్వామి, భీమలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్లలో ఊరేగిస్తూ ఈ ఉత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ పెద్దలు పాల్గొని ఉత్సాహంగా సంప్రదాయ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పార్వేట మహోత్సవం కామనూరు నుంచి బయల్దేరి రాధానగర్, గోపులాపురం, ఎర్రబల్లి, పెద్ద అగ్రహారం, బుక్కాయపల్లె, చిన్న అగ్రహారం, మాచనపల్లి గ్రామాల మీదుగా తిరిగి గురువారం ఉదయం కామనూరుకు చేరనుంది. పార్వేట సందర్భంగా విచిత్ర వేషధారణ, చెక్కభజన, కర్రసాము, కోలాటం, సంప్రదాయ నృత్యాలతో గ్రామస్థులు ఆనంద వేడుకల్లో తేలియాడారు. నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన సోదరుడు రాఘవరెడ్డి గుర్రపుస్వారీ చేసి పలువురిని ఆకట్టుకున్నారు.

బద్వేలు..: బద్వేలు డివిజన్ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు వైభవంగా ముగిశాయి. సంక్రాంతి లక్ష్మీదేవికి మహిళలు నీరాజనాలు పలికారు. కనుమ పండుగ రోజు పశువులను అలంకరించారు. సంక్రాంతి సంబరాలు, ఆనందోత్సాహాల మధ్య వైభవంగా ముగిశాయి.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం..: పట్టణంలోని అబ్బరాతివీధిలో మహిళలు బుధవారం గొబ్బెమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అబ్బరాతివీధిలో మహిళలందరూ స్థానిక రామాలయం వద్దకు చేరి, గొబ్బెమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గొబ్బెమ్మ, ఆట పాటలతో అలరించి, అనంతరం పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించి, నెల్లూరురోడ్డులోని నాగులచెరువులో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కలసపాడు..: కలసపాడులో మంగళవారం కనుమ సందర్భంగా పార్వేట కార్యక్రమాన్ని నిర్వహించారు. కలసపాడులో కోలాటాలు, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో నిర్వహించారు.

పోరుమామిళ్ల..: మండల ంలోని నాగులకుంట్ల గ్రామంలో పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. గ్రామస్థులు సీతారామ లక్ష్మణ సమేత ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఊరి చివర కుందేలును వదిలి పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు.

దువ్వూరు..: పాత దువ్వూరులోని కోదండ రామస్వామి దేవాలయం నుంచి దువ్వూరు మీదుగా కోదండరామున్ని కోలాట వేడుకలతో ఊరేగించారు. పుల్లారెడ్డిపేటలోని డిగ్రీ కాలేజీ వద్దకు స్వామిని ఊరేగింపుతో తీసుకెళ్లారు. భజన కార్యక్రమాలతో కనువిందు చేశాయి.

మైలవరం..: మండల పరిధిలోని కల్లుట్ల, బెస్తవేముల, దొమ్మరనంద్యాల తదితర పంచాయతీల్లో పార్వేట ఉత్సవాలు మంగళ,బుధవారాల్లో రసవత్తరంగా సాగాయి. కరమలవారిపల్లి, వేపరాలల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఏవో వెంకట కృష్ణారెడ్డి తన చెల్లెలి జ్ఞాపకార్థం యువతకు ముగ్గులు, తదితర పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. యువత పార్వేట కార్యక్రమంలో పోటీ పడి పందేలలో పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్లలోని నడివూరు ఆంజనేయస్వామి పార్వేట కార్యక్రమం బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. నడివూరు రామాలయం నుంచి పారువేట ప్రారంభం అయ్యింది. కడప రోడ్డు గుండా మార్కెట్ యార్డు వరకు సాగింది. రోడ్డు వెంబడి కోలాటం, భజనలు చేశారు. రాత్రి నడివూరు రామాలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. తెల్లార్లు స్వామివారి వెంట చెక్కభజనలు కోలాటం నిర్వహించారు. యార్డులో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా లైటింగ్,తాగునీటి వసతులు కమిటీ ఏర్పాటు చేసింది.

రాజుపాలెం..: వెల్లాల చెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి, భీమలింగేశ్వర, పార్వతీదేవిల పార్వేట అంగరంగ వైభవంగా జరిగింది. మొదటగా వెల్లాల గ్రామంలో తరువాత గోపల్లె, మల్లెవేముల, పగిడాల, దద్దనాల, కుమ్మరపల్లె, పర్లపాడు గ్రామాల్లో ఈ పార్వేట ఉత్సవం రాత్రి 12గంటల వరకు నిర్వహించారు. ఈ పార్వేట ఉత్సవానికి ప్రత్యేక ఆహ్వానితులుగా టీడీపీ నాయకులు తోట మహేశ్వర్‌రెడ్డి,తాత్కాలిక చైర్మన్ బీఎల్ నారాయణరెడ్డి, ఈవో రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్లు దుద్యాల చంద్రశేఖరరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, సర్పంచ్ గోవర్ధనరెడ్డి పాల్గొన్నారు.

టంగుటూరులో..: మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో సోమేశ్వర, పార్వతీదేవి, మదనగోపాల స్వామి రుక్మిణి, సత్యభామ పార్వేటు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలు, చెక్కభజన మధ్య సాగిన ఈ పార్వేట ఉత్సవం గ్రామ చివరి వరకు కొనసాగింది. ఈవో రామచంద్రాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని టీడీపీ నాయకుడు కాకర్ల సంజీవరెడ్డి, నీటిసంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుంకిరెడ్డి పాల్గొన్నారు. కాగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ మద్దిలేటి, ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కుకున్నారు. అందులో భాగంగా 14వ తేదీ సంక్రాంతి పండుగ రోజు సాయంత్రం జమ్మలమడుగు, మోరగుడి, తదితర గ్రామాల్లో శ్రీ సీతారామ లక్ష్మణ విగ్రహాలను ట్రాక్టరులో మెరువణి చేశారు. అలాగే 15వ తేదీ జమ్మలమడుగులోని గొరిగెనూరు, దేవగుడి, ఎస్.ఉప్పలపాడు, సున్నపురాళ్లపల్లె తదితర గ్రామాల్లో పార్వేట ఉత్సవం నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు. పెన్నానదిలో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ముద్దనూరు..: మండల పరిధి పెద్దదుద్యాల గ్రామంలో బుధవారం పార్వేట ఉత్సవరం ఘనంగా నిర్వహించారు.అందులో భాగంగా వరదరాజులస్వామి ఉత్సమూర్తులను గ్రామంలో ఊరేగించారు.భక్తులు పార్వేట ఉత్సవానికి తరలివచ్చారు.

ప్రొద్దుటూరు టౌన్..: పట్టణంలోని వివిధ ఆలయాల్లో స్వామివారికి పార్వేట ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. బొల్లవరంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ సమీపంలోని మైదానంలో పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుందేలును వదిలారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవాన్ని పురవీధుల్లో నిర్వహించారు. రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో గంగాగౌరీ సమేత ముక్తిరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మల్‌రోడ్డులోని పెన్నానది తీరంలో పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. నరసింహాపురంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పార్వేట ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెన్నాతీరంలో పార్వేట నిర్వహించారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరులోని లక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో సంక్రాంత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మాధవరాయస్వామి పార్వేట వైభవంగా జరిగింది. బృందావనం ,కోలాటం, కేరళ డ్రమ్స్,చెక్క భజన కార్యక్రమాలు జరిగాయి. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ స్వామి వారిని దర్శించు కొన్నారు. ఎమ్మెల్యే రాయల్ కూడలి వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయల వారి కాంస్య విగ్రహం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యాపరాల చిన్న, దనపాల జగన్,ఏపీ రవీంద్ర,ఆర్ శ్రీనివాసులు,ఆకుల కృష్ణయ్య, కటారి కృష్ణ,కాలువగురప్ప,బండి అమర్‌నాథ్,బండి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: సంక్రాంతి సందర్భంగా బుధవారం మండలంలోని చెంచయ్యగారిపల్లె, మల్లేపల్లె, లింగయ్యగారిపల్లె, ఎద్దులాయపల్లె, డి.అగ్రహారం, రేకలకుంట్ల గ్రామాల్లో కనుమ పండుగ సందర్భంగా గ్రామంలోని పెద్దలు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీరామచంద్రస్వామిని భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. అనంతరం పార్వేట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, కాణాల మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, రేకలకుంట శివయాదవ్, చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మల్లెబాలక్రిష్ణ, చిలమల నాగయ్య ప్రజలు, యువకులు ,మహిళలు పాల్గొన్నారు.

బద్వేలుటౌన్..: మున్సిపాలిటీ పరిధిలోని పోరుమామిళ్లరోడ్డు, అబ్బరాతివీధిలో, రాజుగారివీధిలో, గాంధీనగర్‌లో ఆ కాలనీవాసులు గౌరమ్మకు గత మూడు రోజులపాటు గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు బుధవారం అమ్మవారిని ఊరేగింపుగా గొబ్బెమ్మపాటలు పాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలను, కోలాటంతో, భాజా భజంత్రీలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాశినాయన..: మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. కనుమ పండుగ నాడు గొంటువారిపల్లె,ఆకులనారాయణపల్లె గ్రామాల్లో చౌడేశ్వరీదేవి గ్రామోత్సవం నిర్వహించారు. రంగవల్లుల పోటీలు,పలు సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామాలు సందడిగా మారాయి.

ఖాజీపేట..: మండల పరిధిలోని ప్రతి గ్రామంలో వెలసిన సీతారాముల ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం చివరి రోజు కావడంతో ఆటలు, ముగ్గుల పోటీలు, కోలాటాలతో ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. రాత్రి సీతారాముల విగ్రహాల ఊరేగింపు బాణసంచా పేల్చుతూ మంగళవాయిద్యాల మధ్య గ్రామోత్సవాలను నిర్వహించారు. మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ మోహన్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చాపాడు..: మండలంలోని వెదురూరు, నరహరిపురం, రాజుపాళెం గ్రామాల్లో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి పండుగను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. వెదురూరులోని సంగమేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న దేవతామూర్తులు అయిన శివ, పార్వతీదేవిలను పెద్ద సంఖ్యలో భక్తులు దైవదర్శనం చేసుకున్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మిల్లు శ్రీనివాసులు స్వామివారిని దర్శనం చేసుకున్నారు. కోలాటం, డ్యాన్స్ ప్రోగ్రాం, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెదురూరు, నరహరిపురం గ్రామాల్లో బుధవారం రాష్ట్రస్థాయి ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు బహుమతులు పంపిణీ చేశారు. వెదురూరు గ్రామంలో నిర్వహించిన పోటీల్లో నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుంపూరు మన్నుదిన్నె గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు 2,353 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు టౌన్ వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్దులు 2352 అడుగులు లాగి రెండో బహుమతి రూ.70 వేలు, ప్రొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన శివకృష్ణ ఎద్దులు 1828 అడుగులు లాగి మూడో బహుమతి రూ.40 వేలు గెలుచుకున్నారు. నరహరిపురం గ్రామంలో నిర్వహించిన పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2,545 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నాయి. మైదుకూరు పట్టణానికి చెందిన వెంకటేశ్వర్ ఎద్దులు 2,538 అడుగులు లాగి రెండో బహుమతి రూ.70 వేలు, ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2,054 అడుగులు లాగి మూడో బహుమతి రూ.40 వేలు గెలుచుకున్నట్లు నిర్వహకులు తెలిపారు.


మైదుకూరు..శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం ఆవిష్కరిస్తున్న పుట్టా


బద్వేలు..గౌరమ్మను ఊరేగింపుగా తీసుకువస్తున్న మహిళలు


ఖాజీపేట...కోలాటం వేస్తున్న మహిళలు



ప్రొద్దుటూరు.. ప్రత్యేక పూజలు అందుకుంటున్న ప్రసన్న వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహం, గుర్రంపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


దువ్వూరు.. ఊరేగింపు సందర్భంగా మహిళల కోలాటం


చాపాడు... బండలాగుతున్న ఎద్దులు

రంగవల్లులు మన సంస్కృతికి చిహ్నాలు: తులసిరెడ్డి



కొండాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రంగవల్లులు మన సంస్కృతికి చిహ్నాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మెన్ తులసిరెడ్డి తెలిపారు. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో బుధవారం మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గులపోటీలలో గెలుపొందిన నిరోషా అనే మహిళకు గ్రైండర్‌ను మొదటి బహుమతిని అందజేయగా,పాల్గొన్నవారికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో వేదపండితులు జానకిరామశర్మ, రాఘవరెడ్డి, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో శాశ్వత సభ్యత్వం తీసుకున్న నేతలు


శాశ్వత సభ్యత్వం తీసుకున్న టీడీపీ నాయకులను అభినందిస్తున్న రితీష్‌రెడ్డి

కాశినాయన జనవరి15:(ఆంధ్రజ్యోతి) కాశినాయన మండల టీడీపీ అధ్యక్షుడు వడ్డమాను రాజారెడ్డి, కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బబంగారు గుర్విరెడ్డి,పిట్టిగుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బుసిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఒక్కొక్కరూ రూ.1లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.ఆమేరకు ముగ్గురు నాయకులకు పార్టీకేంద్ర కార్యాలయం నుంచి వాట్సాప్ సందేశం అందింది. శాశ్వత సభ్యత్వం తీసుకున్న ముగ్గురు టీడీపీ నాయకులను బుధవారం బద్వేల్ టీడీపీ సమన్వయకర్త యువనేత కే.రితీష్‌రెడ్డి,క్లస్టర్ ఇంచార్జి మురుకూడి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు అభినందించారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పందేలు

● విజేతలుగా జిల్లా వాసులు

జలదంకి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో మంగళవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు భారీగా జనం తరలివచ్చారు. ఈ పోటీలలో విజేతతోపాటు వరసగా 5 బహుమతులు వైఎస్సార్ కడప జిల్లా ఎడ్ల జతలే గెలుచుకున్నాయి. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటపల్లి గ్రామసర్పంచు మార్తాల చంద్రమౌళిరెడ్డి ఎడ్ల జత ప్రథమస్థానం సాధించడంతో కావలి మాజీ ఎమ్మెల్యే ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డి సన్మానించి రూ.50వేలు, ప్రత్యేక మెమెంటో అందజేశారు. ద్వితీయ బహుమతి వేముల మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణయ్య ఎడ్లు గెలుపొందగా, వాటి యజమానికి రూ.40వేలు, మెమెంటో ఇందూరి బ్రదర్స్ అందజేశారు. తృతీయ బహుమతిని ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన రైతు మార్తాల వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు గెలుపొందగా రూ.30వేలు, మెమెంటోను పెద్దిరెడ్డి బ్రదర్స్ అందజేశారు. 4వ స్థానంలో మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలా సూరారెడ్డి ఎడ్లు రూ.20వేలు, మెమెంటో, 5వ స్థానంలో నిలిచిన వేముల మండలం బెస్తవారిపల్లి గ్రామానికి చెందిన జితిన్ విహాన్ ఎడ్ల జతకు రూ.15వేలు, మెమెంటోను నిర్వాహకులు అందజేశారు.